పసుపు రైతు కన్నెర్ర

- కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలపై ఆగ్రహం
- పసుపునకు మద్దతు ధర, రైతు భరోసా, రుణమాఫీ సంపూర్ణంగా ఇవ్వాలని పోరుబాట
- 24న అసెంబ్లీకి ముట్టడికి నిర్ణయం

వ్యవసాయ మార్కెట్ యార్డులో మద్దతు ధర ప్రకటించాలని నినాదాలు చేస్తున్న పసుపు రైతులు

మెట్‌పల్లి, మార్చి18: కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలపై పసుపు రైతులు కన్నెర్ర జేస్తున్నారు. రుణమాఫీ, రైతు భరోసా సంపూర్ణంగా అమలు చేయాలని, పసుపునకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా ఈ మూడు డిమాండ్లను సాధించడమే లక్ష్యంగా ఈనెల 24న రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడించాలని నిర్ణయించారు. మంగళవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు ఐక్యవేదిక నాయకులు పసుపు కుప్పలను పరిశీలించారు. క్రయ, విక్రయాలు, పలుకుతున్న ధరలపై రైతులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి మాట్లాడారు. తమది రైతు ప్రభుత్వం అని చెబుతూ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల ముందు పసుపునకు మద్దతు ధర కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. కనీస గిట్టుబాటు ధర లేక పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. పసుపునకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15 వేలు ప్రకటించి, రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా 'చలో అసెంబ్లీ ముట్టడి'కి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మామిడి నారాయణరెడ్డి, ఎలిసే గూడ పాపన్న, మారు మురళీధర్‌రెడ్డి, కొట్టాల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దిగ్యాత్ర


స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న సీఐ, ఎస్ఐ, పోలీసులు

ధర్మపురి, మార్చి 18: ధర్మపురి నర్సన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర ఘనంగా నిర్వహించారు. మొదట దక్షిణ దిగ్యాత్రలో భాగంగా శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను సేవపై ఉంచి మేళతాళాల మధ్య దక్షిణ దిశలో పోలీస్‌స్టేషన్ దాకా శోభాయాత్రగా చేరుకున్నారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది స్వామివారి సేవలను భుజం పై మోసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఉత్సవ మూర్తులను స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై ఆశీనుల్ని చేసి పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉత్తర దిగ్యాత్రలో భాగంగా స్వామివారల ఉత్సవ మూర్తులను ఉసిరిక వాగు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వేళలో స్వామివారికి దోపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈఓ సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు ఎదులాపురం మహేందర్, బాధినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంబంకాడి గణేశ్‌కుమార్, వొజ్జల సొజన్య, అవ్వ గంగాధర్, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు నేరెల్ల శ్రీనివాసాచార్య, వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 18: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దవాఖానలో ఓపీ, ల్యాబ్, మందుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. వైద్యులను ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలందించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు శ్రీనివాస్, అనిల్, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గొల్లపల్లి, మార్చి 18: సైబర్ నేరాలు, మహిళలపై అకృత్యాలు, రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి సీఐ రాం నర్సింహా రెడ్డి సూచించారు. గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆయన గొల్లపల్లి ఎస్ఐ సతీశ్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మహిళలు చిన్నపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, ఈవ్ టీజింగ్ నిర్మూలనకు షీ టీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌ను ఏర్పాటు చేశామని, వీటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ నంబర్ 1930, రోడ్డు భద్రత, డయల్ 100, కమ్యూనిటీ పోలీసింగ్ గురించి వివరించారు. మైనర్లు వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి రవి, పోలీస్ కళాబృందం, షీటీమ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 18: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన కౌలు రైతు మతులాపురం రాజం అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబ సభ్యులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమ పథకాల అమలుతో పాటు విత్తనాలు, ఎరువులు, సాగు నీరు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. కానీ, ఈ అసమర్థ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అటు రైతు భరోసా ఇవ్వక, ఇటు రుణమాఫీ కాక, మరోవైపు సాగునీరు కూడా ఇవ్వకపోవడంతో పంట దిగుబడి లేక అప్పుల పాలై అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రోజుకో రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అన్నదాతల ఉసురు ఈ ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆనంద రావు మాజీ సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, నాయకులు శేఖర్, రామ్ కిషన్, గడ్డం శ్రీనివాస్, ప్రశాంత్, మల్లయ్య, సాగర్, రాంరెడ్డి, సన్నీ, మురళీధర్ రావు, శ్రీనివాస్, భూమేశ్, తదితరులున్నారు.

ఎండుతున్న పంటల పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, మార్చి 18: మండలంలోని హైదర్‌పల్లి గ్రామంలో లైశెట్టి వెంకటేశ్, జక్కుల వెంకటి పంట పొలాలు నీళ్లు లేక ఎండిపోతుండగా మంగళవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నీటిని విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మోరపల్లి డీ-53 కెనాల్ ద్వారా నీళ్లు వెంటనే విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాగు నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నా కనీసం పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఈ చేతగాని ప్రభుత్వంలో రైతన్నల జీవితం అస్తవ్యస్తమైందన్నారు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు మండుటెండల్లో కూడా చెరువులు మత్తడి దుంకాయని, మళ్లీ బీఆర్ఎస్ వస్తేనే తమ జీవితాలు బాగుపడతాయని రైతన్నలు ఆవేదనతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రూరల్ మండలాధ్యక్షుడు ఆనంద రావు, మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ గంగాధర్, నాయకులు గంగారెడ్డి, రాజేశ్, శంకర్, దుబ్బ రాజం, వొడ్నాల వెంకన్న, రాములు, జంకుల వెంకటి, లైశెట్టి వెంకటేశ్, ఆదిరెడ్డి, శేఖర్ భూమయ్య, మహిపాల్, ప్రవీణ్, రాజ్‌కుమార్, మహేందర్, రవి, భీమయ్య, గంగాధర్, గంగారెడ్డి, రాజం, వెంకటేశ్, కళ్యాణ్, గంగన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి

వంటావార్పు చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

జగిత్యాల, మార్చి 18: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సేవలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 48 గంటల ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి రోజు సోమవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే రోడ్డుపై బస చేశారు. రెండో రోజు మంగళవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ ఏవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి గుగ్గిల్ల రజిత, నాయకులు జయప్రద, స్వప్న, విజయలక్ష్మి, రజిత, సుజాత, జ్యోతి, కళావతి, హరిప్రియ, సురేఖ, సుమలత, రమ, ఆదిలక్ష్మి, వెంకటాచారి, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

మల్లాపూర్, పెగడపల్లి పోలీస్ స్టేషన్ల ఆవరణలో ఉన్న బీఆర్ఎస్వీ నాయకులు

మల్లాపూర్/పెగడపల్లి, మార్చి 18: బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మల్లాపూర్‌లో బీఆర్ఎస్వీ నాయకులను మంగళవారం వేకువజామున పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకుడు భైరి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని, రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్వీ నాయకుడు కాటిపల్లి వినోద్‌రెడ్డి, తదితరులున్నారు. అలాగే, పెగడపల్లి మండల బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బీసీ బిల్లుకు మద్దతివ్వడం హర్షణీయం

జగిత్యాల, మార్చి 18: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసన సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టగా బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ పార్టీలు మద్దతు తెలుపడం హర్షణీయమని టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని టీబీసీ జేఏసీ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా లక్ష్మణ్, కార్యదర్శి ములస్తం శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్, ఉపాధ్యక్షుడు సింగం భాస్కర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెల్ముల ప్రకాశ్ రావు, సంయుక్త కార్యదర్శి దండిగాల విఠల్, న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు నిధులు కేటాయించాలి

జగిత్యాల, మార్చి 18: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.30 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జగిత్యాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు రూ.100 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ, నామ మాత్రంగా రూ. 6, 7 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ బడ్జెట్‌లో రూ. 30 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు సబ్‌ప్లాన్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బీసీ మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా, బొమ్మిడి నరేశ్‌కుమార్, అనుమల్ల సంజయ్ సామ్రాట్, బండపెల్లి మల్లీశ్వరి, రాపర్తి రవి, హృషికేశ్, బండపెల్లి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పసుపు క్వింటాల్ @ రూ.11,333

మెట్‌పల్లి, మార్చి 18: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు కొమ్ము(కాడి) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,333, కనిష్ఠంగా రూ. 7,896 , పసుపు మండ (గోళ) గరిష్ఠంగా రూ. 10,211, కనిష్ఠంగా రూ.7,501, పసుపు చూర గరిష్ఠంగా రూ. 8,269, కనిష్ఠంగా రూ. 6 వేలు పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 24699 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, మార్చి 18: గ్రామీణ ప్రాంత ప్రజలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ రాష్ట్ర చైర్‌పర్సన్ శోభ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్రాంచిని మంగళవారం ఆమె సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రాష్ట్ర చైర్‌పర్సన్ శోభ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 928 బ్రాంచిలు ఉన్నట్లు తెలిపారు. ఈ బ్యాంక్‌లో జాతీయ బ్యాంక్‌ల మాదిరిగా అన్ని సేవలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా నవీన్‌కుమార్

కథలాపూర్, మార్చి 18: ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు కెప్టెన్‌గా కథలాపూర్ మండలం భూషణరావుపేట జడ్పీ హైస్కూల్ పీడీ నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరుగనున్నాయి. నవీన్‌కుమార్‌ను పాఠశాల హెచ్ఎం నల్ల రాజయ్య, పీడీలు అభినందించారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం

కథలాపూర్, మార్చి 18: కథలాపూర్ మండలం భూషణరావుపేట జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నల్ల రాజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కామినేని దవాఖాన ఎండీ పూజలు

ధర్మపురి, మార్చి 18: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం కామినేని దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం వారికి దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవి స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేసి, శాలువాతో సన్మానించారు.

ఆయిల్ పామ్ సాగును పెంచాలి

జగిత్యాల, మార్చి 18: జిల్లాలో ఆయిల్ పామ్ సాగు పెంపునకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ మొక్కల గ్రౌండింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాదిగా జరిగిన సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగు పురోగతిపై వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని సూచించారు. వచ్చే మూడు నెలల్లో ప్రతి వ్యవసాయ అధికారి ఒక్కో వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో 50 ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని సాధించాలని, ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో చివరి ఆయకట్టున ఎస్సారెస్పీ నీరందని రైతులను గుర్తించి ఆయిల్ పామ్ సాగుకు డైవర్ట్ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో డీహెచ్ఎస్ఓ శ్యామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, లోహియా కంపెనీ సాంకేతిక సలహాదారులు డాక్టర్ రంగనాయకులు, టెక్నికల్ అడ్వైజర్ పాల్గొన్నారు.

నర్సింగాపూర్ అక్రమ పట్టాలు రద్దు చేస్తూ ఉత్తర్వులు

జగిత్యాల రూరల్, మార్చి 18: నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు సర్వే నంబర్ 437, 251లో అసైన్డ్ భూములను ఆక్రమంగా పట్టా చేసుకున్న 15 మందికి గతంలోనే నోటీసులు జారీ చేశామన్నారు. 13.21 ఎకరాల ప్రభుత్వ భూమి ధరణి పోర్టల్‌లో అక్రమంగా తమ పేర్లు నమోదు చేసుకోగా, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే, సర్వే నంబర్ 251లో 19 ఎకరాల 7 గుంటలు, సర్వే 437 నంబర్‌లో 71 ఎకరాల 13 గుంటల భూమిని కొందరు పహాణిలో ఎక్కించుకున్నట్లు గుర్తించిన అధికారులు సదరు భూములను స్వాధీనం చేసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ముగ్గురు రైతులు స్వచ్ఛందంగా 3 ఎకరాల 15 గుంటల భూమిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఎరువుల దుకాణం ప్రారంభం

మల్యాల(కొడిమ్యాల), మార్చి 18: మల్యాల మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ధరణి ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ చరణ్‌దాస్, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, డీపీఎం వెంకటేశ్, ఏపీఎం రాజయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి, ధరణి ఎఫ్‌పీవో అధ్యక్షురాలు మానస, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యవర్గం

జగిత్యాల, మార్చి 18: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతను జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బియ్యాల హరిచరణ్ రావు, కొలగాని మధుసూదన్, వుజగిరి జమునా రాణి, చంద నాగరాజు, దొమ్మాటి వినోద్ గౌడ్, స్కౌట్స్ మాస్టర్ మ్యాడం భూమారెడ్డి, చుక్క కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

కోరుట్ల, మార్చి 18: విద్యార్థులు విద్య, వైజ్ఞానిక, క్రీడా రంగాల్లో పోటీ తత్వాన్ని అలవర్చుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక, జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, మండల విద్యాధికారి నరేశం, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, మార్చి 18: వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాగా, వైద్యులు మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

పాఠశాలల సందర్శన

జగిత్యాల టౌన్, మార్చి 18: జగిత్యాల మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ, సారంగాపూర్ మండలం కోనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి సభ్యుడు జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించినట్లు జిల్లా విద్యాధికారి రాము తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో తొలి మెట్టు కార్యక్రమం అమలు తీరు, మిడ్‌లైన్, ఎస్ఏ పరీక్షల విధానం, ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు, వర్క్ బుక్ నిర్వహణను పరిశీలించారు. ఉన్నత పాఠశాలల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ అమలు తీరు, రికార్డులు, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించి, సూచనలు, సలహాలు అందించారు. ఇక్కడ జిల్లా కో-ఆర్డినేటర్ రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఏఐ తరగతులు ప్రారంభం

సారంగాపూర్(జగిత్యాల), మార్చి 18: సారంగాపూర్ మండలం రంగపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ద్వారా విద్యా బోధనను మండల విద్యాధికారి కిశోర్ ప్రారంభించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండగట్టులో దుకాణాల నిర్వహణకు వేలం పాట

కొడిమ్యాల, మార్చి 18: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో దుకాణాల నిర్వహణకు ఆలయ ఈవో శ్రీకాంతరావు ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాట, సీల్డ్ టెండర్, ఈ-టెండర్ నిర్వహించారు. హోటల్ నిర్వహణ రూ. 18,25,000, కిరాణా దుకాణం రూ. 12,15,000, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీం విక్రయానికి రూ. 16,50,000. లాకర్ రూమ్ రూ. 18,00,000, ఫొటో స్టూడియో నిర్వహణకు రూ. 22,00,000, వంట చెరుకు రూ. 80,000, పాదరక్షలు భద్రపరిచే దుకాణం రూ. 9,99,999, టాయిలెట్స్ బ్లాక్ నిర్వహణకు రూ. 15,02,555, మామిడితోట నిర్వహణకు 10,000, గుట్ట కింద షాపు నంబర్ 10కి రూ. 56 వేలు, షాపు నంబర్ 13 నిర్వహించే హక్కును రూ. 55 వేలకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు, షాప్ నంబర్ 9, 12 కోసం సరైన పాట రానందున వాయిదా వేసినట్లు చెప్పారు.

ఆరోగ్యకార్డులివ్వాలి

మెట్‌పల్లి, మార్చి 18: జూనియర్ న్యాయవాదులకు ఆరోగ్య కార్డులు, నెలకు రూ. 5 వేల భృతి ఇవ్వాలని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు అమలు చేస్తున్న పథకాలను ఇక్కడ కూడా వర్తింపజేయాలన్నారు. అర్హులైన న్యాయవాదులకు ఇండ్లు మంజూరు చేయాలని సీఎంకు ఎక్స్ ద్వారా పోస్టు చేసినట్లు పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, మార్చి 18: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమ